క్లుప్తంగా

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం




సంఘ సభ్యురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న క్రైస్తవ పెద్దలు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలులోని క్రీస్తుకృపా సంఘంలో మంగళవారం పాస్టర్స్ ఫెలోషిప్ నగర అధ్యక్షుడు రెవ. పి.టాటావిక్టర్ అధ్యక్షతన పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శానికి పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవ.బి.ప్రతాప్‌సిన్హా, సెక్రటరీ రెవ.జుహాని హాలోనెన్ సందేశం అందించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంఘ సభ్యురాలికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. సమావేశానికి హాజరైన 150 మంది సభ్యులకు బిషప్ శామ్యూల్‌రాజు భోజన ఏర్పాట్లు చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ కోశాధికారి రెవ.సుకుమార్, సెక్రటరీ రెవ.జాన్‌ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రెవ.విజయసారథి, సభ్యులు పాల్గొన్నారు.

11 కేజీల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు



గంజాయి, నిందితులతో ధవళేశ్వరం పోలీసులు

ధవళేశ్వరం: ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలిస్తున్న గంజాయిని ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు, రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన కనుమరెడ్డి పవన్‌కుమార్, కంబాల చెరువుకు చెందిన ఓలేటి సతీష్(డింపు) విశాఖపట్నం ఏజెన్సీలో గంజాయిని కొనుగోలు చేశారు. దానిని విక్రయించేందుకు మంగళవారం ధవళేశ్వరం శివారు ప్రాంతానికి తీసుకువచ్చారు. ధవళేశ్వరం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని, 11 కేజీల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. సీఐ టి.గణేష్, ఎస్సై హరిబాబును ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

బీమా ఉద్యోగ సంఘ నేత కోదండరామ్

రాజమహేంద్రవరం రూరల్: కార్మికుల హక్కులను హరించే కొత్త లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ పిలుపునిచ్చారు. మంగళవారం మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ క్లాస్–3, 4 ఉద్యోగులు నిరవధిక సమ్మె సన్నాహక డెమోన్‌స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి గనెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ, సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు, ఉద్యోగుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని కోరారు.

నిర్వాసితుల ఆందోళన

ధవళేశ్వరం: దేవీపట్నం మండలంలో పోలవరం నిర్వాసిత ముంపు గ్రామాల నిర్వాసితులను తరలించిన పునరావాస కాలనీలో సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక పోలవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద మంగళవారం నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. ఆర్ ఆర్ ప్యాకేజీ బకాయి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. భూ నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీలో 200 పని దినాలు కల్పించాలన్నారు. ఇళ్లకు మరమ్మతులు చేసి, కాలనీల్లో రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ స్కూల్, పాఠశాల, కమ్యూనిటీ హాల్, గుడి, పశువుల స్థలం తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రిన్సిపాల్‌ను నియమించాలి

కంబాలచెరువు: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. సుమారు 450 మంది విద్యార్థినులు కళాశాల నుంచి ఇంటర్మీడియెట్ ఆర్‌జేడీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, ధర్నా నిర్వహించారు. రెండున్నర గంటల సేపు ధర్నా కొనసాగింది. విద్యార్థుల సమస్యలను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. మంగళవారపుపేటకు చెందిన సిరి మౌళీమోహన్ (42) ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్స్‌లో పని చేసేవాడు. కంపెనీలో సొమ్ము వాడుకోవడం, అప్పుల కారణంగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాగలలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజవోలులో వైఎస్సార్ జయంతి వేడుకల్లో వేణు, రాజాబాబు తదితరులు



కొంతమూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఎం అలీ



దోసాలమ్మ కాలనీలో చీరలు పంపిణీ చేస్తున్న వేణు



కడియంలో రైతులను సత్కరిస్తున్న గిరజాల బాబు తదితరులు

పేదల గుండెచప్పుడు వైఎస్సార్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- ఘనంగా దివంగత మహానేత జయంతి వేడుకలు
- నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు



బొమ్మూరులో చీరలు పంపిణీ చేస్తున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గొందేశి శ్రీనివాసులరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: కష్టాల్లో ఉన్న పేదల గుండెచప్పుడు తెలుసుకుని పాలన అందించిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కొనియాడారు. మంగళవారం బొమ్మూరు గ్రామంలో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెల్లుబోయిన వేణు, గొందేశి శ్రీనివాసులరెడ్డి చేతులమీదుగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. వేణు మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ, 108 తదితర సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా వైఎస్సార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తండ్రి బాటలో, తండ్రికి తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

రాజవోలులో..

అదేవిధంగా రాజవోలు గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు ఆధ్వర్యంలో చెల్లుబోయిన వేణు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్ల పంపిణీ జరిగింది. మోరంపూడి జంక్షన్‌లో పార్టీ నాయకులు చీరారాజు, బొప్పన సుబ్బారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి చెల్లుబోయిన వేణు పూలమాలలు వేసి, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ రేలంగి వీరవెంకటసత్యనారాయణ, పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డా.అనసూరి పద్మలత, పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవ.విజయసారథి, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణుచక్రవర్తి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంగాడ సత్యప్రియ, జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజు, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమిల్లి చిన్న, పడాల వీరరాఘవరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొంతమూరులో..

పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి అలీ ఆధ్వర్యంలో కొంతమూరులో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి ఆయనతో పాటు, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజన్న సేవలు మరువలేనివి

కడియం: ప్రజా సంక్షేమ పాలనలో దేశానికే దిశానిర్దేశం చేసిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. కడియపులంక పంచాయతీలోని దోసాలమ్మకాలనీలో పార్టీ నాయకులు ఈలి గోపాలం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే వేమగిరి తదితర గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. దోసాలమ్మకాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, నాయకులు దాసరి శేషగిరి, కొండపల్లి పట్టియ్య, అయినవిల్లి వేంకటేశ్వరరావు, తోకల శ్రీనివాసరావు, చింతపర్తి రాంబాబు, మార్గాని బలరాం, రెడ్డి శ్రీను, దాసరి శ్రీనివాస్, గండి రమణ, అలజంగి రాంబాబు, పంతం నాగేశ్వరరావు, ఈలి శ్రీనివాస్, మెల్లిం గంగరాజు, బలుగూరి గోవిందు, గాడి శ్రీను, నూకవేణి, గారపాటి బుజ్జిబాబు, చీకట్ల మాచరయ్య, ఏ.రాంబాబు, పాస్టర్ పరంజ్యోతి, నరమామిడి గణేష్, తాతపూడి రాంబాబు, బుడ్డిగ వీరవెంకట్రావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కడియపులంకలో వైఎస్సార్ విగ్రహానికి ఆకుల వీర్రాజు తదితరుల నివాళులు

దేవీచౌక్ సెంటర్‌లో..

కడియం దేవీచౌక్ సెంటర్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు) ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఆదర్శ రైతులను ఘనంగా సత్కరించి, నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, నాయకులు దాసరి శేషగిరి, అయినవిల్లి వేంకటేశ్వరరావు, ఈలి గోపాలం, కొత్తపల్లి శివాజీ, తోకల శ్రీనివాసరావు, కుసునూరి బాబులు, రత్నం కృష్ణ, దొడ్డా బుజ్జి, సర్కార్‌బాషా, పున్నమరాజు వీర్రాజు, చిలుకూరి రామకృష్ణ, బిళ్లకుర్తి ముత్యాలరావు, చింతపర్తి రాంబాబు, మెల్లిమి గంగరాజు, గోవిందు, బుడ్డిగ వీరవెంకట్రావుగౌడ్, నరమామిడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై..

కడియపులంక జాతీయ రహదారిపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు బోడపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు నివాళులర్పించారు. వైఎస్సార్ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలశెట్టి శ్రీను, జనపరెడ్డి శ్రీనివాస్, ఆకుల వెంకన్న, మండెల శ్రీధర్, బోడపాటి మూర్తి, గంధం శ్రీను, ఆకుల ఆదియ్య, జంగా కేదార్‌నాథ్, ఉండమట్ల సత్తిబాబు, బొర్సు వీర్రాజు, కురుమళ్ల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. బుర్రిలంకలో వైఎస్సార్ విగ్రహానికి చెల్లుబోయిన వేణు పుష్పాంజలి ఘటించారు. పార్టీ నాయకులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, గిరజాల వీర్రాజు, కొత్తపల్లి శివాజీ, తాడాల చక్రవర్తి, ఈలి సత్తిబాబు, గాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. స్థానికులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ పాలపర్తి ప్రకాష్‌కుమార్, నాయకులు మద్దుకూరి గోపి, శాకా కిరణ్, మోటుక మునియ్య, నిచ్చెనకోళ్ల గోవిందు, బుడ్డిగ లక్ష్మణరావు, కామన సోమరాజు, మద్దుకూరి పుల్లయ్య, లారీ, రాయి మోహన్, మారే శ్రీను, వెలుపల్లి సుబ్రహ్మణ్యం, నాగిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు. వేమగిరిలో జాతీయ రహదారిపై వైఎస్సార్ విగ్రహానికి చెల్లుబోయిన వేణు తదితరులు పుష్పాంజలి ఘటించారు. స్థానిక నాయకులు వెలుగుబంటి అచ్యుతరామ్, బదుగు ప్రశాంతకుమార్, గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు,విప్పర్తి ఫణికుమార్, యడ్ల రాజారమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు. మురమండలో వైఎస్సార్ విగ్రహానికి స్థానిక నాయకులు నివాళులర్పించారు.



జేగురుపాడులో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సతీష్‌చంద్రస్టాలిన్ తదితరులు



వేమగిరి వద్ద జాతీయ రహదారిపై కేక్ కట్ చేస్తున్న నాయకులు

జన హృదయ నేత వైఎస్సార్

ధవళేశ్వరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జన హృదయ నేత అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కొనియాడారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడు వైఎస్ అని నివాళులర్పించారు. పార్టీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), తడాల చక్రవర్తి, గరగ శ్రీనివాసరావు, పెన్నాడ జయప్రసాద్, గోలి దేవకుమార్, మోర్త పావనమూర్తి, ముత్యాల పోసికుమార్, షబ్బర్ బాషా, దేవులపల్లి సరితారాణి, డాక్టర్ బొల్లంగి సత్యగిరి, శ్రీరంగం బాలరాజు, గునిపే అశోక్, హమీద్ బాషా, పేర్ల బాసి, కరుకు ఇమ్మానీయేలు, బొడ్డేటి శివాజీ, ముత్యాల జాన్, నంబూరి రవి, మస్తాన్ బేగ్, దాసరి ధర్మ, వీర్ల సాయి, బర్రి కామేశ్వరరావు, పందెళ్ల భానుప్రసాద్, గఫూర్, బాబి తదితరులు పాల్గొన్నారు.



ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వేణు, నాయకులు

బడుగుల ఆశాజ్యోతి వైఎస్



వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఆఫీసులో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా, గూడూరి శ్రీనివాస్ తదితరులు



రాజమహేంద్రవరం సిటీ ఆఫీసులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు

- మహానేత పాలన ఓ స్వర్ణయుగం
- జయంతి వేడుకల్లో మాజీ ఎంపీ భరత్‌రామ్
- నగరంలో అనేక సేవా కార్యక్రమాలు

రాజమహేంద్రవరం సిటీ: పేద ప్రజలు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ కొనియాడారు. మార్గాని ఎస్టేట్స్‌లోని వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో మంగళవారం దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం స్థానిక తాడితోట సెంటర్ వాంబే గృహాల వద్ద, కోటగుమ్మం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద, క్వారీ మార్కెట్ సెంటర్, దానవాయిపేట తదితర చోట్ల జయంతి వేడుకల్లో భరత్‌రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకున్నారని గుర్తు చేశారు. అలాగే పేద పిల్లల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారని చెప్పారు. అద్భుత పథకాలతో వైఎస్సార్ పాలన స్వర్ణయుగంలా సాగిందన్నారు. తండ్రి బాటలోనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. స్కూళ్ల అభివృద్ధి, సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం తదితర కార్యక్రమాలతో విద్యాభివృద్ధికి బాటలు వేశారన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక పేదల పథకాలకు తూట్లు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు. డాక్టర్ వైఎస్సార్ ఆశీస్సులతో, ప్రజల దీవెనలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్నేహానికి ప్రాధాన్యమిచ్చే మహానేత

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్నేహానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చే మహనీయుడని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ జయంతి వేడుకలను స్థానిక తిలక్‌రోడ్‌లోని తన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా మనసుతో పాలన సాగించిన మానవతా మూర్తి వైఎస్సార్ అని, అందుకే ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు, జగనన్న సారథ్యంలో పయనిస్తున్నామన్నారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని వైఎస్సార్ తీసుకువచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ, మంచి పనులు చేసే నేతలు ప్రజల మనసుల్లో గుర్తుండిపోతారన్నారు. వైఎస్సార్ ఆశయాలు సాధించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. పాదయాత్ర చేసి దేశ రాజకీయ చరిత్రను వైఎస్సార్ తిరగరాశారని కొనియాడారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేసిన దార్శనికుడు అని నివాళులర్పించారు. రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయం పండగ అని నిరూపించిన మహోన్నతుడు వైఎస్సార్ అన్నారు. తండ్రి అడుగుజాడల్లోనే వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు మాట్లాడుతూ, వైఎస్సార్ పాలనలో 74 లక్షల మందికి పెన్షన్లను మంజూరు చేశారన్నారు. అద్భుత పాలన అందించిన మహానేత అని కొనియాడారు.



కోటగుమ్మం సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆజాద్‌చౌక్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మైనార్టీ సెల్ నాయకులు

ఆజాద్ చౌక్‌లో..

మహానేత వైఎస్సార్ జయంతిని స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్ సెంటర్లో పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షుడు ఎండీ అరిఫుల్లా ఖాన్, పార్టీ నాయకులు నయీం భాయ్, నిజాం, కరీంఖాన్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏపీ పేపర్‌మిల్ మెయిన్ గేట్ వద్దనున్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. స్థానిక కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పీసీసీ సభ్యులు బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్ శ్రద్ధాంజలి ఘటించారు.

దుకాణాల్లో ఈగిల్ టీం ఆకస్మిక తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థల సమీపంలో ఉన్న షాపుల్లో పొగాకు ఉత్పత్తులు, గుట్కా నిల్వలపై మంగళవారం ఈగిల్ టీం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. డీజీపీ ఉత్తర్వుల మేరకు ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆపరేషన్ సేఫ్ క్యాంపస్‌కు ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని స్కూళ్లు, కాలేజీలకు వంద గజాల సమీపంలో ఉన్న షాపులు, దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు, గుట్కా నిల్వలు, ఇతర నిషేధిత మత్తు పదార్థాల అమ్మకాలపై, స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి దుకాణంలో క్షుణ్ణంగా సోదాలు జరిపారు. పొగాకు ఉత్పత్తులు, గుట్కా నిల్వలను సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ఈ సోదాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. యువతను పాడు చేసే మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్న, అక్రమంగా వాటిని విక్రయించినా ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి షాపు యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఈగల్ టీం, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వెంటనే బకాయిలు విడుదల చేయాలి

కంబాలచెరువు: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘ జిల్లా కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆరు త్రైమాసికల ఫీజు బకాయిలు రూ.4,200 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలు రూ.2,200 కోట్లను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడుదల చేస్తానని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు వాటి విషయం మాట్లాడకపోవడం చాలా అన్యాయమన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద మహా ధర్నాకు పిలుపు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.త్రిమూర్తులు, పి.లావణ్య, టి.భావన, ఎన్.ప్రసన్న, టి.స్పందన, కె.సుమంత్, జి.భగవత్, హెచ్.సుధాకర్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

మహిళ మెడలో గొలుసు చోరీ

కంబాలచెరువు: మహిళ మెడలో బంగారు గొలుసును తస్కరించిన సంఘటన స్థానిక టి.నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడేనికి చెందిన పచ్చగుండల మురళీకృష్ణ కుటుంబ సమేతంగా రాజమహేంద్రవరం వచ్చాడు. స్థానిక కుమారి థియేటర్ వద్ద నిలబడి ఉండగా, ఆయన భార్య మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసును దొంగ లాక్కుని పారిపోయాడు. ఈ మేరకు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.